క్లుప్తంగా

పదో తరగతి పరీక్షలకు 44 మంది గైర్హాజరు

బల్లికురవ: మండల పరిధిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మంగళవారం రెండు కేంద్రాల్లో 44 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సుపరింటెండెంట్‌లు, రామంజనేయులు, సుజాత తెలిపారు. బల్లికురవ పరీక్ష కేంద్రంలో 199 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 36 మంది, వైదన పరీక్ష కేంద్రం 2590 మంది హాజరు కావల్సి ఉండగా 8 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్‌లు వివరించారు.

పది పరీక్షలకు ఇద్దరు విద్యార్థుల డుమ్మా

కారంచేడు: మండల పరిధిలో పదో తరగతి పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కారంచేడు ఎంపీడీఓ బి. బాబూరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం 143 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 141 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు డుమ్మా కొట్టారని ఎగ్జాం చీఫ్ జె. శేఖర్‌బాబు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జి. భాస్కరరావు తెలిపారు.

అర్హులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: మండల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదుకు చివరి అవకాశంగా ఏప్రిల్ 15 లోపు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న చేసుకోవచ్చని తహసీల్దార్‌ఎం. సుభద్ర మంగళవారం తెలిపారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు లేకపోయిన కొత్త ఓటర్లు నమోదుకైనా తగిన ధ్రువీకరణ పత్రాలు ఫారం 6 నుం బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులకు విచారణతో ఓటు హక్కు కల్పిస్తామని వివరించారు.

ఎన్నికల కోడ్ అమలు పరిశీలన



ఎన్నికల కోడ్ అమలును పరిశీలిస్తున్న ఎంపీడీఓ యూబీ వరప్రసాద్

చినగంజాం: మండలంలో అమలవుతున్న మోడల్ కోడ్‌ను పరిశీలించేందుకు బుధవారం ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ గ్రామాల్లో పర్యటించారు. గొనసపూడి, చింతగుంపల గ్రామాల్లో పలు పార్టీ జెండాలను తొలగించాల్సిందిగా గ్రామ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. మండలంలో ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు కావాలని ఆయన అధికారులకు సూచించారు. రెవెన్యూ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ విధిగా పాటించాలి



వంకాయల పాడులో కోడ్ అమలును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

ఇంకొల్లు (చినగంజాం): ఎన్నికల కోడ్‌ను విధిగా పాటించాలని ఇంకొల్లు ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పార్టీ జెండాలను, రాజకీయ నాయకుల ముసుగు వేయడం వంటి పలు అంశాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించాలని సూచించారు. మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

చినగంజాం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు సంబంధించి బుధవారం చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిషు పరీక్ష మూడో రోజు ప్రశాంతంగా జరిగింది. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 255 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 240 మాత్రమే హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో 9 మంది సప్లిమెంటరీ విద్యార్థులు కాగా 6 గురు రెగ్యులర్ విద్యార్థులు గైర్హాజరయ్యారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇంగ్లిషు పరీక్షకు 174 మంది హాజరు కావాల్సి ఉండగా 170 మంది హాజరయ్యారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్‌గా గైర్హాజరవుతుండగా మరో ఇద్దరు దివ్యాంగులు కావడంతో ఇంగ్లిషు పరీక్షను రాయలేలేదని డిపార్ట్‌మెంట్ చీఫ్ డి. హేమంత్ కుమార్ తెలిపారు.

పుట్టిన ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

కొత్తపట్నం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో ప్రకారం పుట్టిన ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.వైష్ణవి సూచించారు. బుధవారంమాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రతి బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. పాస్‌పోర్ట్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్, వివాహం.. మొదలగు వాటన్నింటికి తప్పనిసరిగా అవసరమని, హాస్పిటల్లో కాన్పు చేయించుకుని జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని ఆమె కోరారు. సీహెచ్‌వో ఓంకార్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కూరగాయల దుకాణం వద్ద మహిళతో మాట్లాడుతున్న హనిమి రెడ్డి



టీ దుకాణంలో టీ కాస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని పలు దుకాణాలు, టీషాపుల వద్ద ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ అవరణలో ఉన్న కూరగాయల దుకాణం, ధాన్యాల షాపునకు, ఫ్యాన్సీ షాపులకు వెళ్లి ప్రస్తుత మార్కెట్ ధరలను వ్యాపారులకు అడిగి తెలుసుకున్నారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను తెలుసుకున్నారు. టీ స్టాల్‌లో టీ కాచారు. అందరితో కలిసి సరదాగా టీ తాగి కాసేపు ముచ్చటించారు. కాబోయే ఎమ్మెల్యే తమ వద్దకు వచ్చి స్నేహితుడి కలిసి మాట్లాడటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అద్దంకి ఆర్టీసి డిపో మేనేజర్ రామ్మోహనరావును కలిసి వివిధ గ్రామాల నుంచి పరీక్షలు రాసేందుకు వస్తున్న పదో తరగతి విద్యార్థులకు అసౌకర్యం కలిగించకుండా సకాలంలో బస్సులు అందుబాటులో ఉంచాలని డీఎంను కోరారు.

ఘనంగా అఖండ హరే రామ నామ సంకీర్తన



పెదగంజాంలో హరేరామ నామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: రామకోటి 18 వ వార్షికోత్సవం సందర్భంగా పెదగంజాం శ్రీ భూనీలా సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో బుధవారం అఖండ హరే రామ నామ సంకీర్తన ఘనంగా ప్రారంభించారు. భక్తులు విశేషంగా పాల్గొని రామనామ సంకీర్తనను నిర్విరామంగా నిర్వహించేందుకు పాల్గొన్నారు. పెదగంజాం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భజన మండలిలు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చాయి. ఇందులో భాగంగా విష్వక్సేనారాధన, శుద్ధి పుణ్యాహం, అజస్ర దీపారాధన (అఖండం)ను వెలిగించారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కొణికిలో నేత్ర దానం



మృతుడు దావులూరి రాఘవయ్య(ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలలోని కొణికి గ్రామానికి చెందిన దావులూరి రాఘవయ్య (70) బుధవారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అతని నేత్రాలను రోటరీ క్లబ్ అవయవదాన కమిటీకి దానం చేశారు. కమిటీ సభ్యులు గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులచే దాత కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులు భార్య పోషమ్మ, కుమారుడు రామాంజనేయులు, కోడలు నాగలక్ష్మిలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



యనమదల ప్రతిష్టా కార్యక్రమంలో యడం బాలాజీ



గోశాల భూమి పూజలో భాగంగా ఆవుకు ఆహారం తినిపిస్తున్న వెంకటేష్

యద్దనపూడి: మండలంలోని యనమదలలో నూతనంగా నిర్మించిన ఆభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు నారాయణం వెంకట సందీప్ దీక్షిత్, జీవీ మురళికృష్ణప్రసాద్, నారాయణం శ్రీనివాసాచార్యులు, దీవి వెంకటసీతారామగోపాల్, నారాయణం మనోజ్‌కుమార్, యాజ్ఞిక బృందం ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, హోమాలు, అర్చనలు, నిర్వహించారు. ఈ ప్రతిష్టా కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

గోశాల నిర్మాణానికి భూమి పూజ

చీరాల టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నూతన గోశాల నిర్మాణానికి చీరాల అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ భూమి పూజ చేశారు. బుధవారం దేవస్థానంలో నూతన గోశాల మందిరం నిర్మాణానికి పండితుల మంత్రోచ్ఛరణలతో భూమి పూజా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ హాజరై భూమి పూజను చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవస్థాన ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ

పర్చూరు (యద్దనపూడి): స్థానిక వై. జంక్షన్‌లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థాన ప్రధాన ముఖద్వారం నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ముఖ ద్వారానికి అయ్యే ఖర్చును ప్రధాన దాత నూతన పాడు గ్రామానికి చెందిన చిమటా శ్రీనివాసరావు భరిస్తారని తెలిపారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారికి సింధూరపూజ, ఆకుపూజ, అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కోటా హరిప్రసాద్, గొట్టిపాటి శ్రీనివాసరావు, కఠారి సురేంద్ర, కోటా శ్రీనివాసరావు, తులసి శివనాగేశ్వరావు, రంగిశెట్టి అంజనేయులు, మంగళగిరి కోటేశ్వరావు, లగడపాటి శంకర్ పాల్గొన్నారు.



ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు



ప్రతిష్టకు సిద్ధమైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం

మార్టూరులో ఆలయ ప్రతిష్ట రేపు

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో శుక్రవారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవి నూతన ఆలయ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక బొడ్డురాయి సెంటరులో దాతల సాయంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, విఘ్నేశ్వరుడు, గోపుర కలశం, మహావతార్ బాబాల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్వామి, అమ్మవార్లకు సువర్ణ యజ్ఞోపవీతం నేత్రాల సమర్పణ



రజిత యజ్ఞోపవీతం, సువర్ణ నేత్రాలకు పూజలు నిర్వహిస్తున్న సుబ్బారావు, రాజకుమారి



స్వామి, అమ్మవార్లకు సమర్పించిన రజిత యజ్ఞోపవీతం, సువర్ణ నేత్రాలు ముక్కెర

ఒంగోలు మెట్రో: ఫాల్గుణ మాసం బుధవారం శుక్ల ఏకాదశి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని కొప్పోలు చెన్నకేశవస్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం సమీర్‌కుమార్ ఆధ్వర్యంలో పురుష సూక్తంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్థానిక కొప్పోలు గ్రామస్తులై యూఎస్ఏలో ఉంటున్న పోతినేని సుబ్బారావు, రాజకుమారి, వారి కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మీ అమ్మవారికి 350 గ్రాముల నూతన రజిత యజ్ఞోపవీతం మహా సంప్రోక్షణ, 8 గ్రాముల సువర్ణ నేత్రాలు ముక్కెర మహా సంప్రోక్షణను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వారిని అర్చకుడు సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం ఉత్తరాయనం ఫాల్గుణమాసం పుష్యమి నక్షత్రం ద్వాదశి తిధి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

28న ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం

అద్దంకి రూరల్: సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా వారిచే ఈనెల 28న అద్దంకిలోని గరకాయపాలెం (బట్టీ బడి) ఆవరణలో 18 సంవత్సరాల్లోపు వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో 1,2 డి.గంగాధరరావు, బి. సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, యూడీఐడీ కార్డు తీసుకుని రావాలని కోరారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459, 9490386762 నంబర్లను సంప్రదించాలన్నారు.

నోరు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం



ఓరల్ డే ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు టౌన్: నోరు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, లేకపోతే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని స్థానిక సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) దంతవైద్య విభాగం అధిపతి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డేని పురస్కరించుకుని బుధవారం నగరంలోని మంగమూరుడొంకలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిలో వేలాది బ్యాక్టీరియాలు ఉంటాయని, నోటిని తరచూ శుభ్రం చేసుకోకపోతే శరీరంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. పొగాకు ఎక్కువగా వాడటం వలన రక్తం చెడిపోతుందని, క్యాన్సర్, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ పొగ తాగడం అనే అలవాటు అనేక మందిలో ఇంకా కొనసాగుతుందని, పిల్లల ఎదుట పెద్దలు పొగతాగడం వలన వారికి తెలియకుండా పిల్లలు కూడా అలవాటు పడుతున్నారని అన్నారు. పొగ తాగడం, పొగాకు నమలడం, గుట్కాల వలన క్యాన్సర్ సోకే ప్రమాదం హెచ్చుగా ఉంటుందన్నారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.భగీరథి మాట్లాడుతూ పిల్లలకు రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకునే అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్యశ్రీ, ప్రేమ, వినోద్, గీత, హిమబిందు, అభిజిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సుజ్ఞానమ్మ తదితరులు

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో బుధవారం వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని నాయకులు ప్రారంభించారు. జాతీయ రహదారి వద్ద జై ఆంధ్ర హోటల్ పక్కన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుంచి సుజ్ఞానమ్మ, పార్టీ నాయకుడు యడం లక్ష్మీ దీపక్, ఎంపీపీ భుక్యా శాంతి బాయిలు పూజలు నిర్వహించి ప్రారంభించారు. మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గర్నెపూడి రవిచంద్, అట్లూరి సుకుందరావు, బాబూ నాయక్, గడ్డం మస్తాన్ వలి, కాకోలు రామారావు, మైలా నాగేశ్వరరావు, గొట్టిపాటి ఆనంద్, సులేమాన్, రషద్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



నూజిళ్ళపల్లిలో వైఎస్సార్ సీపీ పార్టీ కండువా కప్పుతున్న నరసింహా రెడ్డి

జె. పంగులూరు: నూజిళ్ళపల్లిలో తెలుగు దేశం పార్టీకి చెందిన 10 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీలోకి చేరాయి. మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు ఆధ్వర్యంలో చేరగా, వీరికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహా రెడ్డి అద్దంకి పార్టీ కార్యాలయంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరసింహా రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ 2019లో తాము టీడీపీకి ఓటు వేశామన్నారు. అయితే ప్రతి పథకం వలంటీర్ల ద్వారా అందిందని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపోగు బుజ్జి, తూర్పు కొప్పరపాడు ఎంపీటీసీ సభ్యులు సింధూర అజిల్, సొసైటీ అధ్యక్షుడు ధూళిపాళ హరిబాబు, బాబురావు, రామరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నిర్వహించండి



ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ యూబీ వరప్రసాద్

చినగంజాం: ఎన్నికల కోడ్ కొనసాగుతున్న దృష్ట్యా ఉపాధి హామీ సిబ్బంది రాజకీయాలతో ఎటువంటి ప్రమేయం లేకుండా పనులను యథావిధిగా కొనసాగించాలని ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశం భవనంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, రాజకీయ సభలు, సమావేశాల్లో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనవద్దని, పార్టీలకతీతంగా కూలీలతో పనులు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా కూలీలకు నీడనిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మజ్జిగ వంటి కూలీలకు ఉపశమనమిచ్చే వాటిని అందుబాటులో ఉంచాలని, కూలీలకు వడదెబ్బ వంటివి తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను సైతం అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జేఈ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

హనిమి రెడ్డికి సంఘీభావం




పానెం శ్రీనివాసరెడ్డితో కొంచా శ్రీనివాసరెడ్డి

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొంచా శ్రీనివాసరెడ్డి అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి మద్దత్తుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు పానెం శ్రీనివాస రెడ్డిని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హరిప్రసాద్‌నగర్‌లో అగ్ని ప్రమాదం



తగలబడుతున్న గుడిసెలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- ఎనిమిది గడ్డివాములకు అలుముకున్న మంటలు
- దట్టమైనపొగతో నిండిన ప్రాంతం

చీరాల: చీరాల హరిప్రసాద్‌నగర్‌లో బుధవారం ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటి వద్ద ఉంచి వరిగడ్డి వాములకు నిప్పంటుకోగా నిమిషాల వ్యవధిలోని అక్కడే ఉన్న గడ్డివాములకు మంటలు వ్యాపించాయి. దీంతో ఎనిమిది గడ్డి వాములకు మంటలు అలుముకున్నాయి. ఒక్కసారిగా మంటలు ఎక్కువ కావడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. మంటలను గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. వరిగడ్డి వాములు ఎక్కువగా ఉండటంతో మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారింది. బాపట్ల నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించారు. అలానే స్థానికులు తోడ్పాటుతో మంటలను అదుపు చేస్తున్నారు. వరిగడ్డి వాములు బోయిన శ్రీనివాసులు, బోయిన వాసుబాబు, దాసరి కోటేశ్వరమ్మ, కత్తి శ్రీనులతో పాటు మరికొందరి వరిగడ్డివాములున్నాయి. మంగళవారం ఇదే ప్రాంతంలో పమిడి సుబ్బారావుకు చెందిన వరిగడ్డివాము అగ్నికి ఆహుతైంది.